క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి


గణనాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పెద్ద హనుమాన్, తేజాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయాల వద్ద గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక బాటలో పయనించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సాబ్లే ప్రతాప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

నేరడిగొండ: విద్యాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని తేజాపూర్‌లో జెడ్పీఎస్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అంతకుముందు వినాయకుడి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, అల్లూ రి ప్రఫుల్‌చందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బద్దం పోతా రెడ్డి, మౌలాన, గడ్డల నారాయణ, క్రాంతి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్య మిత్రలు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రధాన ద్వారం ఎదుట ప్లకార్డులను ప్రదర్శించారు. రాజీవ్ ఆరో గ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 17 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించడంతో పాటు జీవో 60 ప్రకారం నెలకు రూ. 22,750 వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, టీఏ, డీఏ చెల్లించాలని డిమాండ్ చేస్తూ అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవికి వినతిపత్రం అందజేశారు.

గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలి

బజార్‌హత్నూర్: గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేయాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కిషన్ అన్నారు. గురువారం మండలంలోని బలన్‌పూర్‌లో పీపీఆర్ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షాకాలం, చలికాలం ప్రారంభంలో వచ్చే పారుడు వ్యాధి లేదా పీపీఆర్ వ్యాధి నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకున్నామన్నారు. వ్యాధి మోర్బిల్లి వైరస్ వల్ల, మేకలు, గొర్లకు సోకుతుందన్నారు. మండల పశువైద్యాధికారి ఫర్వేజ్ అహ్మద్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: మాల సంక్షేమ సంఘం మావల మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దొగ్గలి గంగయ్య, అధ్యక్షుడిగా మొట్టి పొచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా యేరా సుధీర్, కోశాధికారిగా ఇందూర్ పొచ్చన్న, ఉపాధ్యక్షుడిగా నారాయణ, జాయింట్ సెక్రెటరీగా వడ్డె రమేశ్, సంతోష్, సృజన్, ముఖ్య సలహాదారులుగా బాలక్రిష్ణ, అశోక్, శ్రీనివాస్, మధులను ఎన్నుకున్నారు.

పీఆర్టీయూ..

తలమడుగు: తెలంగాణ పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మంగారపు మహేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా తాక్షండే సంతోష్, అసోసియేట్ అధ్యక్షుడిగా తూమ్ రవీందర్, కార్యదర్శిగా శ్రీరామ్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయులుగా విజయలక్ష్మి, మహిళా కార్యదర్శిగా అరుణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాంసి: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అన్నారు. గురువారం పొన్నారి గ్రామంలో స్వచ్ఛత సీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఎంపీడీవో పంచాయతీ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో లింగయ్య, పంచాయతీ కార్యదర్శి గంగన్న, అంగన్‌వాడీ టీచర్ దేవమ్మ, గ్రామస్తులు రఘు, అశోక్, లక్ష్మిపతి, చంద్రయ్య పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. గురువారం కళాశాలలో భారత్ దేఖో, ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో బోస్ ఫెల్లోషిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు అభిజిత్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు చంద్రకాంత్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జీవో ఇచ్చారు.. అమలు మరిచారు

- సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా మారుస్తూ జీవో గత ప్రభుత్వం
- ప్రభుత్వం మారడంతో అమలు చేయని ప్రభుత్వం
- నిలిచిన భవన నిర్మాణ పనులు


గత ప్రభుత్వం జారీ చేసిన జీవో


నిలిచిన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు

బోథ్: అసలే అభివృద్ధిలో బోథ్ నియోజకవర్గ వెనుకబడి ఉంది. నియోజకవర్గంలో ఉండాల్సిన కార్యాలయాలు, వసతులు లేవు. ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిని గమనించిన తాజా మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్‌లు పలుమార్లు అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావుకు విన్నవించగా, బోథ్ సీహెచ్‌సి నూతన భవనానికి అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10.50 కోట్లు మంజూరు చేసింది. తరువాత కొన్ని రోజులకు సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మార్చింది. ఇందుకు సంబంధించి జీవోను సైతం విడుదల చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను అమలు చేస్తుందా? లేదా? అన్న సందేహాలు నెలకొన్నాయి.

ఆగిన భవన నిర్మాణ పనులు..

బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ ముగిసి, పనులు కూడా ప్రారంభమయ్యాయి. పిల్లర్లు వేసి మొదటి అంతస్తు వరకు గోడల నిర్మాణం లేకుండా పనులు పూర్తి చేశారు. ఈక్రమంలో తాము చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. ఉన్నదంతా పెట్టి కట్టామని, బిల్లులు రాకుండా పనులు పూర్తి చేయలేమని చేతులెత్తేశారు. దీంతో సంవత్సర కాలంలో పనులు ఆగిపోయాయి. ఉన్న పలు గదుల్లోనే వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు సరిపడా బెడ్‌లు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాగా భవన నిర్మాణం చేపట్టాలని ఇటీవల సూపరింటెండెంట్ రాజనాల రవీంద్ర ప్రసాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా దృష్టికి తీసుకెళ్లారు.

వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్..

బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని సీహెచ్‌సీని జిల్లా వైద్యారోగ్యశాఖ నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మార్చారు. కొన్ని రోజుల అనంతరం వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మారుస్తూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. స్పెషలిస్ట్ వైద్యులు, అన్ని సౌకర్యాలు, ఫర్నీచర్, ఇతర సామగ్రి కోసం రూ.17.50 కోట్లు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు జీవోను అమలు చేయడం లేదు. దీంతో బోథ్ సీహెచ్‌సీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవోను అమలు చేస్తే బోథ్ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన అవసరం ఉండదు. స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారు. స్కానింగ్‌తో పాటు ఇతర సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

నిధులు తెప్పించాం



అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావును కలిసి బోథ్ సీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.10.50 కోట్లు ఇవ్వాలని ఒప్పించి నిధులు మంజూరు చేయించుకున్నాము. మళ్లీ బోథ్ సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మార్చి, సౌకర్యాలు, వసతుల కోసం రూ.17.50 కోట్లు కేటాయిస్తూ జీవో కూడా జారీ చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి.

– సంధ్యారాణి, మాజీ జెడ్పీటీసీ, బోథ్

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, నిరుద్యోగులకు పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు పొందవచ్చని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూరు మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో 360 పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ముందుగా సంస్థ శాస్త్రవేత్తలు పెరటి కోళ్ల పెంపకంపై, లాభాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కోళ్లు అధిక బరువు కలిగి ఉంటాయని, అధిక మాంసం, గుడ్లు పెడుతాయన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు సర్కార్ వారు పెరటి కోళ్ల పెంపకంలో శిక్షణ ఇస్తారని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాటు కోళ్లతో పోల్చితే పెరటి కోళ్లు తక్కువ రోజుల్లో పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైంటిస్టు బి.ప్రకాష్, రాజకుమార్, విజయ్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్కే బాంజా, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


లీకేజీలను పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో పలు వార్డుల్లో నెలకొన్న మిషన్ భగీరథ నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపాల్ కమిషనర్ ఎండీ. ఖమర్ అహ్మద్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని కేఆర్‌కే కాలనీ, కైలాస్‌నగర్, భుక్తాపూర్ కాలనీల్లో మిషన్ భగీరథ , పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. మిషన్ భగీరథ పైపులైన్లు, లీకేజీలు, నీటి సరఫరాకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన ఆదేశాల మేరకు ప్రజలకు తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపడుతామన్నారు. పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, వాటర్ గ్రిడ్ ఈఈ గోపిచంద్, కౌన్సిలర్ బండారి సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల పాముకాటుకు గురైన యశ్వంత్ అనే విద్యార్థికి ఉపాధ్యాయులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. గురువారం పాఠశాలలో హెచ్ఎం హనుమండ్లు, కాంప్లెక్స్ హెచ్ఎం శ్యాంసుందర్ తలకొంత డబ్బులు పోగుచేసి యశ్వంత్ తల్లితండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేశ్, బక్కి వెంకటేష్, సీఆర్పీ రవీందర్, తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

తాంసి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి శ్రావ్య సిబ్బందితో కలిసి విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆవరణలో కిచెన్ షెడ్డులో భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ తులసీరాం, పీహెచ్ఎన్ సంపత్ కుమారి, ఏఎన్ఎం లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీలత, ఆశ కార్యకర్తలు లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

ఇంద్రవెల్లి: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐకేపీ, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రామారావ్, పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో గురువారం స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సమీపంలో పిచ్చి మొక్కలు తొలగించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించుకోవాలని సూచించారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి


నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జీవన్ రెడ్డి

బోథ్: ప్రతీ గ్రామ పంచాయతీలో ఓటరు జాబితాలను ప్రదర్శించాలని, ఏమైనా తప్పులు, సవరణలు ఉంటే ఈనెల 21వరకు లిఖిత పూర్వకంగా అందజేయాలని ఎంపీడీవో జీవన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఓటరు లిస్ట్ వెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. ఏమైనా సవరణలు ఉంటే తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్: ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సవరించుకోవాలని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. అభ్యంతరాలు ఉంటే నేరుగా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేయాలన్నారు. సమావేశంలో సీఐ రహీంపాషా, ఎంపీడీవో జవహర్, ఎంపీవో స్వప్నశీల, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహేందర్ కుమార్ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఈనెల 26వ వరకు మార్పులు చేర్పులకు అవకాశం ఉందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. మండల పంచాయతీ అధికారి వినోద్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి


ఎదులాపురం: నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ కోరారు. గురువారం ధర్నాకు సంబంధించి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బొగ్గు గనులు, రైల్వే, ఎల్ఐసీ, టెలికాం, బీఎస్ఎన్ఎల్ ఇతరతలను ప్రైవేటు పరం చేయడం, విక్రయించడాన్ని తక్షణమే ఆపాలని, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్లు, కేజీబీవీ, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశాలను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. నాయకులు సుభాష్, శేషరావు, నర్సింగ్, దేవిదాస్, జనార్ధన్, ప్రసాద్, కైసర్, గణేశ్, రమాకాంత్, సంతోష్, ప్రదీప్ పాల్గొన్నారు.

సక్రమంగా రుణాలు చెల్లించాలి


మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ నాగ ఫణీంద్ర

బోథ్: స్వయం సహాయక మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగ ఫణీంద్ర అన్నారు. గురువారం బ్యాంకులో ఐకేపీ సిబ్బంది, స్వయం సహాయక మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత, లావాదేవీలు, ఇన్‌స్యూ పథకాలతో పాటు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవ, సీసీలు సంజీవ, సుభద్ర, గంగాధర్, లక్ష్మయ్య, విజయలక్ష్మి, స్వామి, సాయి, గంగామణి, లక్ష్మి, సంగీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు


మాట్లాడుతున్న అధికారి పార్థసారథి

ఆదిలాబాద్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బ్యాడ్మింటన్ అండర్ 14, 17 బాల బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి ప్రారంభించారు. నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమవుతాయన్నారు. తల్లిదండ్రులు కూడా చిన్నారులను ప్రోత్సహించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. ఎస్జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, బ్యాడ్మింటన్ కోచ్ కబీర్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ విజయవంతం చేయండి


నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసిన జైనూర్‌కు చెందిన షేక్ మాగ్దుమ్‌ను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న నిర్వహించే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ పిలుపునిచ్చారు. గురువారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు కుమురం భీం కాలనీలో మాట్లాడారు. గత కొన్ని రోజుల నుంచి ఆందోళన చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు అత్యాచారం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ ఆదివాసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత, తుడుందెబ్బ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, సలామ్ వరుణ్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: జైనూర్ మండలంలో గిరిజన మహిళపై అత్యాచారం, హత్యయత్నానికి పాల్పడిన నిందితుడిని ఉరి తీయాలని ఈనెల 21న రాష్ట్ర బంద్‌కు తుడుందెబ్బ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు సహకరించాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్కే పాండురంగ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. వ్యాపారస్తులు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలన్నారు. కార్యక్రమంలో నైతం రమేశ్, ఉయికే సుదర్శన్, సందీప్, గంగాధర్, ఉత్తం, ఇస్తారి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రం బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు కోరారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడారు. వ్యాపార దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేయాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కొట్నక్ బారిక్‌రావ్, చిత్రం రాము, సోయం మురారి, కోవ రాజేశ్వర్, కనక తుకారం, మడావి ఇంద్రు, దుర్వ జుగాదిరావ్ పాల్గొన్నారు.

బేల: ఆదివాసీ మహిళకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న రాష్ట్ర బంద్ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గోండ్వన రాయి సెంటర్, ఆదివాసీ 9 తెగల సంఘాల నాయకులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వ్యాపారస్తులు, కార్మికులు, ప్రజలందరూ సహకరించాలని కోరారు. రాయిసెంటర్ అధ్యక్షుడు కోరేంగ సోనెరావ్, ప్రధాన కార్యదర్శి కోడప భీం రావ్, సిడాం నందు కుమార్, మడవి చంద్రకాంత్, కొడప రవీందర్, మడావి దివాకర్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ, ఇచ్చోడ రహదారిలో గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై అప్పరావ్ తెలిపారు. ఇచ్చోడ గ్రామానికి చెందిన షేరాజ్, యాకుబ్‌లు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఆవులు, ఒక లేగదూడను పట్టుకున్నామన్నారు. పశువులను గోసంరక్షణ కేంద్రానికి తరలించి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు, రోడ్లు డివైడర్ల మధ్యలో, ప్రధాన చౌక్‌ల్లో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే పురపాలక సంఘ చట్టం- 2019 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తలమడుగు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తలమడుగు, దేవాపూర్, కజ్జర్ల, పల్లి (బి), బరంపూర్, అర్లి(కె), రుయ్యాడి, కొతూరు, సుంకిడి, కుచులాపూర్, ఖోడద్ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రంగనేని రామారావు, సంజీవరెడ్డి, నాగన్న, చంద్రరెడ్డి పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

ఇంద్రవెల్లి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండంలోని ఏమాయికుంట గ్రామాన్ని సందర్శించి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతీ మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, మొక్కలను సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఎంపీవో సుమీర హైమద్, ఈవో సంజీవ్‌రావు పాల్గొన్నారు.

రూ.81వేలు పలికిన లడ్డూ

బోథ్: మండల కేంద్రంలో గురువారం పలు గణేశ్ మండపాల వద్ద లడ్డూ వేలాన్ని నిర్వహించారు. అత్యధికంగా చైతన్య యూత్ గణేశ్ మండలి వద్ద లడ్డూ ధర రూ.81 వేలు పలికింది. మండల కేంద్రానికి చెందిన ఇట్టెడి చిన్నారెడ్డి లడ్డూను దక్కించుకున్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

నేరడిగొండ: మండలంలోని చింబోలి గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుడు కిషన్ ఒక్కడే పిల్లలకు పాఠాలు బోధిస్తున్నాడు. గురువారం పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు.

ఎస్పీని కలిసిన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేసిన జిల్లా ఎస్పీని సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్ఞాపిక అందజేశారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, బండారి వామన్, గెడం మాధవ్, పుసం ఆనంద్, ఎన్నవర్ రాజు పాల్గొన్నారు.

డీసీవోను కలిసిన స్కూల్ పేరెంట్స్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ గర్ల్స్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి డీసీవోగా పదోన్నతి పొందిన లలిత కుమారిని స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఓం ప్రకాష్, మలపతి సుభాష్, దీపక్, కుమ్ర శ్రీనివాస్, మహేందర్, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని చాటిన ముస్లిం యువకుడు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో వినాయకుని మండపం వద్ద గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామానికి చెందిన షేక్ ఆసిఫ్ పాల్గొని భక్తులకు వడ్డించారు. ప్రతీ సంవత్సరం అయప్ప పూజా కార్యక్రమాల్లో, వినాయకుని మండపాల వద్ద నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మతసామరస్యాన్ని చాటుతున్నాడు.

అర్హులకు ఓటుహక్కు కల్పించాలి


బ్యాగులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

తలమడుగు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహ క్కు కల్పించాలని తహసీల్దార్ రాజ్ మోహన్ అన్నారు. గురువారం త హసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల దాటిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి యువతీ, యువకుల వివరాలు సేకరించాలన్నారు. అనంతరం బీఎల్‌వోలకు రాష్ట్ర ఎన్నికల అధికారులు అందించిన బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.